సాక్షి
కామారెడ్డి

బుధవారం । 24 । జనవరి । 2024



ఘనంగా నేతాజీ జయంతి

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.

- 11లో ▸



బిల్లులు అందేదెప్పుడో?

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఐదు నెలలుగా బిల్లులు అందడం లేదు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం

32.1 /18.7

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

జీపీల్లో ప్రత్యేక పాలన!

- నెలాఖరుతో ముగియనున్న పాలకవర్గాల పదవీకాలం
- పంచాయతీకో అధికారిని నియమించేందుకు సర్కారు కసరత్తు
- జాబితా తయారీలో జిల్లా యంత్రాంగం
- జిల్లాలో 526 పంచాయతీలు



సాక్షి, కామారెడ్డి: పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం మరో వారం రోజుల్లో ముగియనుంది. ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించేందుకు అవకాశం లేకపోవడంతో పంచాయతీలు ప్రత్యేక పాలన దిశగా సాగుతున్నాయి. ఇప్పటికే ప్రత్యేకాధికారులను నియమించేందుకు కసరత్తు మొదలైంది.

జిల్లాలో 526 గ్రామ పంచాయతీలున్నాయి. 2019 జనవరి 21, 25, 30 తేదీలలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఫిబ్రవరి 1 న పాలక వర్గాలు బాధ్యతలు చేపట్టాయి. ఐదేళ్ల పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలోనే ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు సమయం లేకపోవడం, పార్లమెంటు ఎన్నికలు కూడా ముంచుకురావడంతో ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను తరువాత నిర్వహించాలని నిర్ణయించింది. పాలకవర్గాల పదవీకాలం నెలాఖరుతో ముగియనుండడంతో ప్రత్యేక అధికారులను నియమించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా గత ఎన్నికల్లో కాటేపల్లి పంచాయతీకి రిజర్వేషన్ సమస్య తలెత్తి ఎన్నికలు జరగలేదు. దీంతో అక్కడ ప్రత్యేకాధికారి పాలనే నడుస్తోంది. మిగతా 525 పంచాయతీలలో వచ్చేనెల ఒకటో తేదీనుంచి ప్రత్యేకాధికారులకు పల్లె పాలన బాధ్యతలు అప్పగించనున్నారు. అందులో భాగంగా జిల్లా పంచాయతీ అధికారులు ప్రత్యేకాధికారుల జాబితాలను రూపొందించే పనిలో పడ్డారు.

మండలాలవారీగా జాబితా..

పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించేందుకుగాను ఆయా మండలాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న అధికారుల జాబితాలను రూపొందిస్తున్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, మిషన్ భగీరథ ఏఈలతో పాటు ఎంపీవోలు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లను ప్రత్యేకాధికారిగా నియమించనున్నారు. పెద్ద పంచాయతీల బాధ్యతలను మండల స్థాయి ముఖ్య అధికారులకు అప్పగించనున్నారు. పంచాయతీ అధికారులు ఆయా శాఖల అధికారుల వివరాలను సేకరించి, జాబితాలను రూపొందిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పంచాయతీ ప్రత్యేకాధికారులను నియమించేందుకు సిద్ధమవుతున్నారు. మూడు నెలల పాటు ప్రత్యేకాధికారులను నియమించి తర్వాత మరో మూడు నెలలు పొడిగిస్తారని తెలుస్తోంది.

బిల్లుల కోసం ఎదురుచూపులు

ఐదేళ్ల పదవీ కాలంలో పంచాయతీలకు సంబంధించిన బిల్లులు సకాలంలో రాక పాలకవర్గాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఇంకా చాలాచోట్ల చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో సర్పంచ్‌లు అధికారులు చుట్టూ తిరుగుతున్నారు. పంచాయతీల్లో నిధులు లేవు. వివిధ పద్దుల కింద రావలసిన బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. పదవీ కాలం కూడా కరిగిపోతుండడంతో సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు బిల్లులు వస్తాయో, ఇబ్బందులు ఎప్పుడు తొలగుతాయోనని ఓ సర్పంచ్ 'సాక్షి'తో ఆవేదన వ్యక్తం చేశాడు. త్వరగా బిల్లులు మంజూరు చేయాలని సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పీసీసీ రేసులో మహేశ్‌కుమార్ గౌడ్

- సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ బెర్త్ ఖాయం!
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జోరుగా చర్చ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కాంగ్రెస్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన నేతలకు కీలక పదవుల విషయమై ఆ పార్టీ శ్రేణులతో పాటు వివిధ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. కాంగ్రెస్ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటయ్యాక మొదటివిడత మంత్రివర్గంలో ఎవరికీ స్థానం దక్కలేదు. దీంతో జిల్లా నుంచి కేబినెట్ బెర్త్ దక్కే విషయమై రకరకాల విశ్లేషణలు జరుగుతూ వచ్చాయి. మైనారిటీ కోటాలో షబ్బీర్‌అలీకి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తారంటూ.. మరోవైపు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌కు సైతం ఎమ్మెల్సీతో పాటు కేబినెట్ బెర్త్ కేటాయించనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. మరోవైపు బోధన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ బెర్త్ దక్కుతుందన్న చర్చ నడుస్తోంది.

షబ్బీర్‌కు సలహాదారు పదవితో..

షబ్బీర్ అలీకి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా పదవి దక్కడంతో ఉమ్మడి జిల్లాకు దక్కాల్సిన కీలక పదవుల విషయమై స్పష్టత వస్తోంది. తాజాగా మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ దక్కడంతో జిల్లా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిది దక్షిణ తెలంగాణ కాగా.. ఉత్తర తెలంగాణ నుంచి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు బీసీ కోటాలో పీసీసీ అధ్యక్ష పీఠం అప్పగించేందుకు పార్టీ హైకమాండ్ ఆలోచన చేస్తున్నట్లు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్ కుమార్ గౌడ్ నిజామాబాద్ అర్బన్ టికెట్టు ఆశించారు. అయితే ఈ స్థానంలో షబ్బీర్ అలీని నిలబెట్టిన నేపథ్యంలో జాతీయ నాయకత్వం సూచన మేరకు ఆయన టికెట్టును త్యాగం చేశారు. మహేశ్ కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తామని పార్టీ అగ్రనేతలు అప్పట్లో హామీ ఇచ్చారని సమాచారం. మారిన సమీకరణాల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్‌కు మంత్రి పదవికి బదులు పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. సుమారు నలభై ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్ ఎన్ఎస్‌యూఐ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, అఖిల భారత యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, పీసీసీ కార్యదర్శిగా, పీసీసీ అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఆర్గనైజింగ్ వ్యవహారాలను వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో మహేశ్‌కుమార్ గౌడ్ అత్యంత సమర్థంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో పీసీసీ పీఠం దక్కడం ఖాయమని పార్టీ శ్రేణులు అంటున్నాయి. బోధన్ నుంచి నాలుగోసారి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ మంత్రి పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గంలో బెర్త్ ఖాయమని తెలుస్తోంది. షబ్బీర్ అలీకి ప్రభుత్వ సలహాదారు పదవి కేటాయించడంతో పాటు, మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి కేటాయించనున్నట్లు తెలుస్తుండడంతో సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ ఖాయమైనట్లేనని పార్టీ నాయకులు, కార్యకర్తలు చెబుతున్నారు.

న్యూస్‌రీల్

నేటితో ముగియనున్న బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా జనవరి నెలకు సంబంధించిన బియ్యం పంపిణీ బుధవారంతో ముగియనుంది. ఇప్పటి వరకు రేషన్ బియ్యం తీసుకోని వారు వెంటనే బియ్యం తీసుకోవాలని రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు సూచించారు.

పీజీ పరీక్షలు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన మూడో సెమిస్టర్ పరీక్షకు 1,708 మంది విద్యార్థులకుగాను 1,618 మంది, మధ్యాహ్నం పరీక్షలకు 181 మంది కిగాను 181 మంది హాజరయ్యారని కంట్రోలర్ తెలిపారు. క్యాంపస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ సెంటర్‌ను రిజిస్ట్రార్ యాదగిరి తనిఖీ చేశారు.

బల్దియాకు విద్యుత్ శాఖ నోటీసులు



కామారెడ్డి టౌన్: విద్యుత్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆ శాఖ అధికారులు మంగళవారం కామారెడ్డి మున్సిపల్ శాఖకు నోటీసులు జారీ చేశారు. విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ రమేష్‌బాబు, డీఈఈ సాలియా నాయక్, ఏవో బాబులు స్వయంగా మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌కు నోటీసులు అందించారు. పట్టణంలోని వీధిదీపాలు, నీటి సరఫరా విభాగం, కార్యాలయాలకు సంబంధించి ప్రతి నెల రూ. 45 లక్షల వరకు కరెంట్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దాదాపు మూడేళ్లుగా బిల్లులు చెల్లించడం లేదని, దీంతో బకాయిలు రూ. 16.68 కోట్లకు చేరాయని పేర్కొన్నారు. మూడు రోజుల్లో బకాయిలు చెల్లించని పక్షంలో మున్సిపల్ కార్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. కాగా విద్యుత్ శాఖకు సంబంధించి మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయి రూ. 16.68 లక్షలు ఉండడం గమనార్హం.

19 రోజుల్లోనే డిగ్రీ ఫలితాల విడుదల



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు స్వయంప్రతిపత్తి వచ్చిన తర్వాత తొలిసారిగా నిర్వహించిన పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. డిగ్రీ ప్రథమ సెమిస్టర్ ఫలితాలను రికార్డు సమయంలో పరీక్షలు నిర్వహించిన 19 రోజుల్లోనే విడుదల చేశామని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఫలితాలను తెలంగాణ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం.అరుణ విడుదల చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అదనపు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ శాంతాబాయి, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ పి.రామకృష్ణ, అదనపు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్స్ పాల్గొన్నారు.

26న మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు

కామారెడ్డి టౌన్: గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో 26న పట్టణంలో మాంసం విక్రయించరాదని బల్దియా కమిషనర్ దేవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా చికెన్, మటన్, చేపల మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేశారు.

విదేశాల్లో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: జపాన్, జర్మనీ దేశాల్లో నర్సింగ్ ఉద్యోగాల కోసం ఆసక్తిగలవారి నుంచి తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ(టామ్‌కాం) దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం, ఏఎన్ఎం పూర్తి చేసిన 22 నుంచి 30 ఏళ్లలోపువారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైనవారికి మూడు నెలల శిక్షణ కాలంలో నెలకు రూ.లక్ష చొప్పున చెల్లిస్తారని, అనంతరం నెలకు రూ. 3 లక్షల వేతనం ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు 89190 47600, 95739 45684, 63022 92450 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మిస్సింగ్ కేసులపై ఫోకస్ పెంచండి

- కేసుల పరిశోధనలో టెక్నాలజీని వినియోగించుకోండి
- నెలవారీ సమీక్షలో ఎస్పీ సింధు శర్మ



అవార్డు అందిస్తున్న ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం: మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా పీఎస్‌ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. కేసుల పరిశోధన, విధుల్లో పాటించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల రక్షణకు పెద్దపీట వేయాలన్నారు. కేసుల పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో ధనిక, పేద వ్యత్యాసాలు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ, పోక్సో, మహిళలపై దాడులు, హింస కేసుల్లో 60 రోజుల్లోగా విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, మోసగాళ్లు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. సీసీ కెమెరాలను నిరంతరంగా పరిశీలించాలన్నారు. పనిచేయని సీసీ కెమెరాలను వెంటనే బాగు చేయించాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, పేకాట, జూదం లాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అక్రమ దందాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉక్కు పాదంతో అణచివేయాలన్నారు. కార్యక్రమంలో సైబర్ నేరాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు.

ఉత్తమ సేవలకు అవార్డులు..

2023 సంవత్సరానికి సంబంధించి ఉత్తమ సేవలందించిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ అవార్డులను అందించారు. హైవే పెట్రోలింగ్ ఎస్సై భూమయ్య, ఆయా విభాగాలకు చెందిన కానిస్టేబుళ్లు సురేష్, హుస్సేన్, మహేందర్ సింగ్, రోహిత్, కార్తీక్, బాలాజీ, గంగాప్రసాద్, స్వామి, రామస్వామి, ఎండీ అజార్, జి.స్వామి, హోంగార్డులలో ఇలియాస్ ఘోరీ, గంగా కిషన్, పి.రాజేష్, సంగమేశ్వర్ అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ కాజల్ సింగ్, ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు ప్రకాష్, శ్రీనివాస్, జగన్నాథరెడ్డి, మదన్‌లాల్ (డీసీఆర్‌బీ), శ్రీనివాస్ (సైబర్ క్రైం), సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

'లెండి' పరిష్కారానికి కృషి

- రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆగిన పనులు పునరుద్ధరించేలా చూస్తాం
- టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం
- అంతర్రాష్ట్ర ప్రాజెక్టు సందర్శన



మహారాష్ట్రలోని అంతర్రాష్ట్ర ప్రాజెక్ట్ లెండి వద్ద పార్టీ నాయకులతో ప్రొఫెసర్ కోదండరాం

మద్నూర్(జుక్కల్): మహారాష్ట్రలో నిలిచిపోయిన అంతర్రాష్ట్ర లెండి ప్రాజెక్ట్ నిర్మాణ పనులపై ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. మద్నూర్ మండలానికి సరిహద్దున మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలుకాలో ఉన్న ప్రాజెక్ట్‌ను మంగళవారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1984లో అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్‌బీ చౌహాన్, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో ఇరు ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకుని లెండి ప్రాజెక్ట్ పనులను ప్రారంభించాయన్నారు. మహారాష్ట్రలో భూనిర్వాసితులు పునరావాసం కోసం ఆందోళనలు చేయడంతో పనులు నిలిచిపోయాయన్నారు. 2003లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి నూతన అంచనా వ్యయాలపై ఒప్పందం చేసుకున్నారన్నారు. లెండి ప్రాజెక్ట్‌లో 62 శాతం మహారాష్ట్రకు, 38 శాతం మన రాష్ట్రానికి ఖర్చులు, నీళ్ల పంచుకోవాలని నిర్ణయించారన్నారు. మొత్తం 14 గేట్లు ఉన్న ప్రాజెక్ట్‌కు ఎనిమిదేళ్ల క్రితం 10 గేట్ల నిర్మాణ పనులు పూర్తి చేశారన్నారు. 4 గేట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

ఒప్పందం ప్రకారం ప్రాజెక్ట్ సామర్థ్యం 6.36 టీఎంసీలు కాగా.. తెలంగాణ వాటా కింద 3.63 టీఎంసీలు కేటాయిస్తారని, ప్రాజెక్టు పూర్తయితే మద్నూర్, బిచ్కుంద మండలాలు సస్యశ్యామలం అవుతాయని కోదండరాం పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో ప్రభుత్వం లెండి ప్రాజెక్ట్ గురించి కనీసం పట్టించుకోలేదన్నారు. ప్రాజెక్టు సమస్యపై గత ప్రభుత్వంతో మాట్లాడే అవకాశం దక్కలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తాము మద్దతు ఇస్తున్న ప్రభుత్వమే ఉన్నందున ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి లెండి ప్రాజెక్ట్, కాలువల పనులు పూర్తి చేసే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేశ్, మెడికల్ ఇన్‌చార్జి శంకర్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి సాబ్దె చందు, నాయకులు రమేశ్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, మహారాష్ట్రకు చెందిన నాయకులు రామస్వామి, నాగరాజు ఉన్నారు.

పుల్కల్ శివారులో చిరుత సంచారం



చిరుత పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

బిచ్కుంద: పుల్కల్, హజ్గుల్ శివారు ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం సాయంత్రం పుల్కల్, హజ్గుల్ మంజీర నది శివారు ప్రాంతంలో చిరుతను చూశామని రైతులు తెలిపారు. వారు ఈ విషయాన్ని వైస్ ఎంపీపీ రాజు పటేల్‌కు చెప్పడంతో ఆయన అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం అటవీ అధికారులు చిరుత సంచరించిన ప్రాంతంలో పర్యటించారు. చిరుత అడుగులను ఫొటోలు తీశారు. చిరుత సంచరిస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నాలుగైదేళ్లుగా చిరుత పుల్కల్, ఎల్లారం, గుండెనెమ్లి శివారు ప్రాంతంలో సంచరిస్తోందని రైతులు పేర్కొంటున్నారు. గతేడాది ఓ ఆవుపై దాడి చేసి గాయపరిచిందన్నారు. ప్రస్తుతం వరినాట్లు వేస్తున్నామని, చిరుత భయంతో కూలీలు రావడానికి భయపడుతున్నారని పేర్కొంటున్నారు. బోను ఏర్పాటు చేసి చిరతను బంధించాలని కోరుతున్నారు.

దశాబ్దాలు గడుస్తున్నా పూర్తి కాకపోవడం శోచనీయం



అమరేశ్వర్ ఆలయంలో పూజలు చేస్తున్న కోదండరాం

బిచ్కుంద: అంతర్రాష్ట్ర లెండి ప్రాజెక్టును ప్రారంభించి నాలుగు దశాబ్దాలు అవుతున్నా ఇప్పటికీ నిర్మాణం పూర్తి చేయకపోవడం శోచనీయమని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం పేర్కొన్నారు. ప్రాజెక్టు సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. మంగళవారం మండలంలోని వాజిద్‌నగర్‌లో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అమరేశ్వర్ ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెండి ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. కాలువలు తవ్వి వదిలేయడం బాధాకరమన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే మద్నూర్, బిచ్కుంద మండలాల పరిధిలో 23 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. సమస్యను సీఎంకు విన్నవిస్తానని పేర్కొన్నారు.

జిల్లాలో అత్యధికంగా కూరగాయలు పండించే వాజిద్‌నగర్‌లో కోల్డ్ స్టోరేజ్ యూనిట్, రవాణా సౌకర్యం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించామన్నారు. ఇక్కడ కోల్డ్ స్టోరేజ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. లెండి ప్రాజెక్టు, రైతుల సమస్యలపై ఇరిగేషన్ శాఖ మంత్రితో మాట్లాడతానన్నారు. కార్యక్రమంలో పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి, ఎంపీటీసీ సాయిలు, మాజీ ఏఎంసీ చైర్మన్ మల్లికార్జునప్ప శెట్కార్, శంకర్ పటేల్, మాజీ ఎంపీపీ సాయన్న, నాయకులు మల్లికార్జున్, రమేష్ పాల్గొన్నారు.

'తనిఖీ బృందాలు అప్రమత్తంగా ఉండాలి'



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు

కామారెడ్డి క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ తనిఖీ బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. మంగళవారం ఈఎస్ఎంఎస్(ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం) యాప్‌పై కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాల చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌లు, ఆయా జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈఎస్ఎంఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం, లాగిన్ అయ్యే విధానం, వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానంపై కేంద్ర ఎన్నికల సంఘం అధికారి సంతోష్ ప్రతారియా వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లా అధికారులతో మాట్లాడారు. వాహనాల తనిఖీలలో మద్యం దొరికితే ఎక్సైజ్ అధికారులకు అప్పగించాలన్నారు. పట్టుబడిన నగదు వివరాలను నోడల్ అధికారులకు సమర్పించాలని సూచించారు. తనిఖీ బృందాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీసీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, సీపీవో రాజారాం, ఎల్లారెడ్డి, కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు చెందిన తనిఖీ బృందాల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'కౌలాస్ కోటకు గుర్తింపు తెస్తాం'



నిజాంసాగర్: కౌలాస్ కోటకు ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకు రావడానికి కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న కౌలాస్ ఖిల్లాను మంగళవారం ఆయన సందర్శించారు. ఖిల్లాలోని కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా కౌలాస్ కోటను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం రోజున కౌలాస్ కోటపై మొట్టమొదటిసారిగా జాతీయ జెండాను ఎగుర వేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట కౌలాస్ కోట వారసురాలు అనితా సింగ్, నాయకులు అస్పత్‌వార్ వినోద్, విఠల్‌రావ్ పటేల్, పాకాల వెంకటేశ్, సాయిలు తదితరులున్నారు.

క్లుప్తంగా

జాతీయ రహదారిపై తనిఖీలు



మద్నూర్(జుక్కల్): సలాబత్‌పూర్‌లో జాతీయ రహదారి-161పై మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాల్లో మోతాదుకు మించి ప్రయాణిస్తున్న వారికి జరిమానాలు విధించారు. నిత్యం రోడ్లపై ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని వారు పేర్కొన్నారు. మద్యం, మత్తు పదార్థాలు తీసుకొని వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హోంగార్డ్‌కు రివార్డు



పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని పీఎస్‌లో ఉత్తమ సేవలందించిన హోంగార్డ్ గోరేకి రివార్డును మంగళవారం ఎస్పీ సింధుశర్మ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ హోంగార్డ్‌ను అభినందించి, మరెన్నో సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి, సీఐ కృష్ణ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

1న జేఎల్‌ఎం స్తంభం పరీక్షలు

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సంబంధించి జూనియర్ లైన్ మెన్ పోస్టుల కోసం అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, స్తంభం పరీక్షలు ఫిబ్రవరి 1న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యుత్ శాఖాధికారి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నియామక కమిటీ ద్వారా స్తంభం పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అర్హుల జాబితాను అభ్యర్థుల చిరునామకు పోస్టు ద్వారా పంపుతామని పేర్కొన్నారు. నాలుగో జాబితాను కార్యాలయ నోటీసు బోర్డులో ఉంచిన్నట్లు తెలిపారు. నియమక ప్రక్రియ పూర్తిగా పారదర్శంగా జరుగుతుందన్నారు.

గంజాయి విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలో గంజాయి విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూర్య బాయ్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఎస్పీ సింధూశర్మకు వినతి పత్రం అందజేశారు. కొంత కాలంగా పట్టణంలో జోరుగా గంజాయి విక్రయాలు సాగుతున్నాయని, యువకులు బానిసలుగా మారుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు సూర్య, శ్రీకాంత్, అరవింద్, మహేష్, గౌస్, అరుణ్, సాజిద్, శషి తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు భద్రత నియమాలు పాటించాలి'

- జిల్లా రవాణా శాఖాధికారి వాణి



కామారెడ్డి అర్బన్: రోడ్డు భద్రతా నియామాలు పాటించకుండా ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న వారిలో యువకులే ఎక్కువ ఉంటున్నారని జిల్లా రవాణా శాఖాధికారి ఎస్.వాణి అన్నారు. మంగళవారం కామారెడ్డి సాందీపని డిగ్రీ కళాశాలలో తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్(టిటా) ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వార్షికోత్సవం నిర్వహించగా వాణి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. డ్రైవింగ్‌లో చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరిగినపుడు తీవ్రతను తగ్గిస్తాయన్నారు. వాహనం నడుపుతున్నమంటే సరైన శిక్షణ, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, నిబంధనల ప్రకారం వేగంలో వెళ్లడం, హెల్మెట్ ధరించడం చేయాలన్నారు. తల్లిదండ్రులు డ్రైవింగ్ లైసెన్స్ లేని పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్, టిటా జిల్లా కార్యదర్శి సీహెచ్ శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబా, దివ్య హస్తం ప్రతినిధులు పాల్గొన్నారు.

సులేమాన్ నగర్‌లో ఉద్రిక్తత

- ఐదు గంటల పాటు రాస్తారోకో
- నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్
- ఏసీపీ హామీతో విరమణ



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



సులేమాన్‌నగర్‌లో రాస్తారోకో చేస్తున్న నాయకులు

రుద్రూర్: రుద్రూర్ మండలంలోని సులేమాన్ నగర్‌లో భజరంగ్ దళ్, వీహెచ్‌పీ కార్యకర్తలు మంగళవారం ఐదు గంటల పాటు ప్రధాన రహదారి (రుద్రూర్- కోటగిరి)పై బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకుని సులేమాన్‌నగర్‌లో సోమవారం శోభా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాల్చిన టపాసులు పేలిపోయి ఒక వర్గానికి చెందిన ప్రార్థన మందిరం వద్ద పడ్డాయి. ఈ ఘటనతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడంతో గ్రామ పెద్దలు శాంతింప చేశారు. కాగా నిర్లక్ష్యంగా టపాసులు కాల్చిన వ్యక్తిని మంగళవారం ఉదయం జీపీ వద్దకు పిలిపించి గ్రామ పెద్దలు మందలించి వదిలేశారు. ఇదే సమయంలో ఒక వర్గానికి చెందిన వ్యక్తులు మరో వర్గానికి చెందిన కొందరిపై దాడికి పాల్పడ్డారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రధాన రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న సమీప గ్రామాల్లోని బజరంగ్ దళ్, బీజేపీ కార్యకర్తలు బాధితులకు మద్దతుగా రాస్తారోకో చేపట్టారు. బాధితులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. స్థానిక పోలీసులు నచ్చజెప్పినప్పటికీ విన్పించుకోలేదు. దీంతో ఘటనా స్థలానికి వచ్చిన బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడంతో అదనపు పోలీసు బలగాలను సులేమాన్ నగర్‌కు రప్పించారు. సీఐలు జయేష్ రెడ్డి, శ్రీనివాస్‌రాజ్ , సమీప పోలీస్‌స్టేషన్‌ల ఎస్సైలు సందీప్ , మహేందర్, కృష్ణ కుమార్ పరిస్థితి చేజారకుండా ఆందోళన చేస్తున్న వారిని సముదాయించే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన ఆందోళన సుమారు ఐదు గంటల పాటు కొనసాగింది. నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ.. రోడ్డుపైన టెంట్ వేసి ఆందోళన చేశారు. అక్కడే అల్పాహారం తీసుకున్నారు. దీంతో కోటగిరి, పోతంగల్ మండలాల నుంచి వస్తున్న వాహనాలను ట్రాఫిక్ డైవర్ట్ చేశారు. ఈ వాహనాలను రాయకూర్, చిక్కడపల్లి గ్రామాల మీదుగా పంపించారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని ఏసీపీ ఇచ్చిన స్పష్టమైన హామితో రాస్తారోకో విరమించారు.

అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి



మాట్లాడుతున్న ఎంపీవో మలహరి

కామారెడ్డి రూరల్: గ్రామ పంచాయతీల్లో ప్రాథమిక అవసరాలను గుర్తించి, సదుపాయాలు కల్పించేందుకు పకడ్బందీగా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీవో మలహరి సూచించారు. మంగళవారం జీపీడీపీ(గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లానింగ్)పై గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయడానికి గ్రామ సభలపై ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేయడానికి ప్రణాళికలు తయారు చేసుకుని ఆన్‌లైన్ చేయాలన్నారు. పంచాయతీల తీర్మానాలు, నిధుల వ్యయం వివరాలను ఈ నెల 27 వరకు వివరాలన్నింటిని ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యదర్శులు శ్రీనివాస్, అనిల్, గణేష్, శ్రీనివాస్, నవనీత, సుమేద, సౌమ్య, సరస్వతి, గంగుబాయి, కల్పన, మౌనిక, సంగీత తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక



కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన భౌతిక రసా యన శాస్త్ర ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ రూపొందించిన లర్న్ సైన్స్ విత్ ఫన్ గేమ్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మే ళాలో పాఠశాల విద్యార్థులు మాధవి, శివ కు మార్ రూపొందించిన స్మార్ట్ టాయిలెట్ సిస్టం, ఆటోమేటిక్ క్లాత్ ప్రొటెక్షన్ ఫ్రమ్ రెయి న్ అనే రెండు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపి కైనట్లు హెచ్‌ఎం సాయి రెడ్డి తెలిపారు. అలా గే వీరికి గైడ్ టీచర్‌గా ఉపాధ్యాయుడు ప్రవీ ణ్ కుమార్ వ్యవహరించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పంచాయతీరాజ్ సెక్రెటరీ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు



సభ్యత్వ రసీదులను చూపుతున్న కార్యదర్శులు

కామారెడ్డి రూరల్: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు(పీఎస్, జేపీఎస్, ఓజేపీఎస్) తెలంగాణ పంచాయతీరాజ్ సెక్రెటరీ ఫెడరేషన్(టీపీఎస్ఎఫ్) సభ్యత్వ నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ సెక్రెటరీల సమస్యలను తీర్చడంలో ఫెడరేషన్ ముందుంటుందని తెలిపారు. అదేవిధంగా ఓపీఎస్‌ల సమస్యలు త్వరగా పరిష్కరించాలని, 4 సంవత్సరాల సర్వీస్ గురించి రాష్ట్ర ప్రభుత్వంతో త్వరితగతిన చర్చలు జరిపి సఫలీకృతం చేయాలని, జిల్లా, రాష్ట్ర నాయకులు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యదర్శులు అనిల్, శ్రీనివాస్, శోభ, కల్పన, సౌమ్య, సరస్వతి, సుమేద, గణేష్, సంగీత, మౌనిక, గంగుబాయి తదితరులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్ ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నస్రుల్లాబాద్ మండల ఆటో యూనియన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులు మండల అధ్యక్షుడిగా దస్తాగౌడ్, ఉపాధ్యక్షుడిగా జబ్బర్, సెక్రెటరీగా నారాగౌడ్, సభ్యులుగా అయ్యూబ్, అజారోద్దీన్, శేషదాదా, అబ్దుల్ సత్తార్, మహేష్ గౌడ్, ఎర్రన్న, మనోహర్‌లను ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సమస్యల పరిష్కారంలో ముందు ఉంటానని దస్తాగౌడ్ అన్నారు.

విధులకు వెళ్లని టీచర్లపై చర్యలు తీసుకోవాలి



డీఈవోకు ఫిర్యాదుచేస్తున్న విద్యార్థిసంఘాల నేతలు

కామారెడ్డి టౌన్: విద్యాశాఖలో స్పెషల్ ఆఫీసర్ల పేరిట స్కూళ్లో విధులకు వెళ్లకుండా ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్న హెచ్‌ఎంలు, టీచర్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డీఈవో ఎస్.రాజుకు ఫిర్యాదు చేశారు. ఏసీజీఈ, డీఎస్‌వో, ఎస్‌జీఎఫ్, డీసీఈబీలుగా నియమితులైన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అసలు పాఠశాలలకు వెళ్లకుండా విద్యాశాఖ జిల్లా కార్యాలయంలోనే ఉంటున్నారని తెలిపారు. సరిగ్గా విధులు నిర్వహించకపోవడం వల్ల విద్యార్థులు తరగతులు నష్టపోతున్నారని వివరించారు. ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, బీవీఎం, బీడీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు రెగ్యులర్‌గా విధులకు హాజరుకావాలని లేని పక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని డీఈవో హెచ్చరించారు.

మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో కార్పొరేషన్ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి మంగళవారం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావుకు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర సమావేశంలో ఆమె పాల్గొన్నారు.

'కళాశాల భూమి కబ్జా కాకుండా చూస్తా'



పూర్వ, ప్రస్తుత ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో ఎమ్మెల్యే

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భూమి అంగుళం కూడా కబ్జా కాకుండా చూస్తానని ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో 1964వ సంవ్సతరం నుంచి పనిచేసిన ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ప్రస్తుత ప్రిన్సిపాల్, అధ్యాపకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1964లో కళాశాల కోసం భూమి కొనుగోలు చేసేందుకు కృషి వారిలో తన తండ్రి కేపీ రాజారెడ్డి ఒకరన్నారు. అనంతర కాలంలో 1980 ప్రాంతంలో కళాశాల భవిష్యత్తు కోసం తన తండ్రి పడ్డ తపనను తాను ప్రత్యక్షంగా చూశానంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కళాశాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. అనంతరం కళాశాల అభివృద్ధికి ఏర్పాటు చేసిన బొటానికల్ గార్డెన్ రాశివనాన్ని పరిశీలించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్, పూర్వ ప్రిన్సిపాళ్ల, అధ్యాపకులు తిలక్‌శర్మ, సి.ప్రభాకర్, బాల్‌రెడ్డి, ఎస్ఎస్.రెడ్డి, సంగయ్య, కరుణాకర్‌రావు, సత్యనారాయణ, పీవీ నర్సింహం, ఎం.మొగలిగౌడ్, విశ్వనాథ్‌రావు, ప్రదీప్‌రెడ్డి, రాఘవరెడ్డి, దామోదర్‌రావు, రంజిత్‌మోహన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్: జిల్లా పద్మశాలి సంఘం ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను నియోజకవర్గ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సిరిగాద లక్ష్మీనరసింహులు, పట్టణ అధ్యక్షుడు చాట్ల రాజేశ్వర్, 17వ వార్డు కౌన్సిలర్ అవధూత నరేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని అధికారులు

ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

బిచ్కుంద(జుక్కల్): మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావు ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయానికి ఎంపీడీవో ఆనంద్ 11.30 గంటలకు కూడా రాలేదు. ఆయన రాక కోసం ఎమ్మెల్యే ఒక గంట వరకు ఎదురు చూశారు. రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. అధికారులు సమయపాలన పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కోసం పని చేయాల్సిన అధికారులు అలసత్వం వీడాలని అన్నారు. వివిధ శాఖల అధికారుల పనితీరుపై ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారని, పద్ధతి మార్చుకొని ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని లేకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు.

పది వేల మొక్కలకు తగ్గకుండా నాటాలి



ఇస్రోజీవాడిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీవో

కామారెడ్డి రూరల్: నర్సరీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీవో మలహరి సూచించారు. మంగళవారం ఇస్రోజీవాడి, గర్గుల్ గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నర్సరీలో రానున్న హరితహారంకు మొక్కలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి నర్సరీలో 10 వేల మొక్కలకు తగ్గకుండా చూడాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా ఉదయం, సాయంత్రం నీళ్లు తప్పనిసరిగా పట్టాలన్నారు. అలాగే ఈ నెలాఖరు వరకు 100 శాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ చింతల రవితేజగౌడ్, గ్రామ కార్యదర్శులు కల్పన, శోభ, ఫీల్డ్ అసిస్టెంట్ బాల్‌రాజు ఉన్నారు.

'సాహిత్య ఆకాష్' హిందీ పుస్తకావిష్కరణ



కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక(తెరవే) జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ సహ సంపాదకత్వం వహించిన 'సాహిత్య ఆకాష్' హిందీ కవితల పుస్తకాన్ని మంగళవారం సాయంత్రం డీఈవో ఎస్.రాజు ఆవిష్కరించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ హిందీ కవులు రాసిన 200 హిందీ కవితల పుస్తకానికి గఫూర్ శిక్షక్ సహ సంపాదకత్వం వహించడాన్ని డీఈవో, హిందీ ఉపాధ్యాయులు అభినందించారు. హిందీ ఉపాధ్యాయులు వంశీధర్, శ్యాంకుమార్, చంద్ర శేఖర్, పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.మనోహర్‌రావు, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత జలాల పెంపునకు చర్యలు



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో అంతర్గత జలాల పెంపునకు కృతిమ జలాశయ ట్యాంక్‌లను ఏర్పాటుకు అవసరమైన స్థలాలను మంగళవారం పరిశీలించారు. సౌత్‌క్యాంపస్‌లో అంతర్గత జలాల పెంపునకు గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టనున్నట్లు ఏపీవో రాధిక తెలిపారు. సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి బాబు, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, టెక్నికల్ పర్సన్ తిరుపతి, అధ్యాపకులు డాక్టర్ అంజయ్య, ఏపీఆర్‌వో డాక్టర్ సరిత పిట్ల, డాక్టర్ నర్సయ్యలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

దేగాంలో బంగారు చైన్ చోరీ

ఆర్మూర్‌టౌన్: ఓ మహిళ మెడలో ఉన్న బంగారు చైన్‌ను గుర్తు తెలియని దుండగుడు చోరీ చేసిన ఘటన ఆలూర్ మండలం దేగాం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మంథని గంగుబాయి ఇంట్లో ఒంటరిగా ఉన్నట్లు గుర్తించిన దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి బంగారు చైన్‌ను దొంగిలించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

మేనూర్‌లో బైక్..

మద్నూర్: మండలంలోని మేనూర్‌లో సోమవారం రాత్రి బైక్ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన గౌతమ్ తన బైక్‌ను రాత్రి ఇంటి ఎదుట నిలిపి నిద్రించాడు. కాగా ఉదయం చూసే సరికి చోరీకి గురైంది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ఈ-కేవైసీకి వచ్చి.. పాముకాటుకు గురై..

- చికిత్స పొందుతూ వివాహిత మృతి
- గ్రామంలో విషాదఛాయలు



దానిబాయి (ఫైల్)

బాన్సువాడ రూరల్: క్యాన్సర్‌కు గురైన భర్తకు హైదరాబాద్‌లో సపర్యలు చేస్తున్న ఓ భార్య స్వగ్రామంలో నిర్వహించిన రేషన్‌షాపు ఈ-కేవైసీకి వచ్చి పాముకాటుతో మృతి చెందిన ఘటన బోర్లం క్యాంపు తండాలో చోటు చేసుకుంది. తండావాసులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన దుంగవత్ దానిబాయి(48) హరిసింగ్ భార్యాభర్తలు. హరిసింగ్ క్యాన్సర్‌కు గురికావడంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. భర్తకు సపర్యలు చేస్తున్న దానిబాయి రేషన్‌షాపు ఈ-కేవైసీ కోసమని స్వగ్రామానికి ఈ నెల 19న వచ్చింది. అదేరోజు రాత్రి దానిబాయిని తన ఇంట్లో నాగు పాము కాటువేసింది. గమనించిన కుటుంబీకులు చికిత్స కోసం బాన్సువాడకు తరలించగా వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. కాగా అనారోగ్యానికి గురైన భర్తకు సేవలు చేస్తున్న దానిబాయి పాముకాటుకు గురై మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుండెపోటుతో విద్యుత్ ఆపరేటర్ మృతి



నర్సింహులు (ఫైల్)

లింగంపేట: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్ గొంగళ్ల నర్సింహులు(36) గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కొన్నేళ్లుగా 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నర్సింహులు మంగళవారం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో అధికారులు కుటుంబ సభ్యులను పరామార్శించి ఆర్థికసాయం అందజేశారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తులు వర్షిత, అక్షర, కుమారుడు హరిశంకర్ ఉన్నారు.

ప్రమాదవశాత్తు జాలరి..

నవీపేట: మండలంలోని నాగేపూర్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన జాలరి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ మంగళవారం తెలిపారు. మద్దెపల్లి గ్రామానికి చెందిన జాలరి బట్టు శ్రీకాంత్(22) ఈనెల 21న సైకిల్ రిపేర్ కోసం నాగేపూర్‌కు వచ్చి తిరిగి ఇంటికి చేరుకోలేదు. మంగళవారం ఉదయం నాగేపూర్‌లో చెరువులో శ్రీకాంత్ మృతదేహం లభ్యమైందన్నారు. చేపలు పట్టేందుకు వెళ్లిన్న శ్రీకాంత్ ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడడంతో మృతి చెందాడని, తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


ముగ్గురి రిమాండ్

మోపాల్: మండలంలోని గుడి తండాకు చెందిన ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన కెతావత్ సుజాత, గోపాల్, సురేశ్ కుటుంబానికి అదే తండాకు చెందిన కెతావత్ రవి, నవీన్ కుటుంబాల మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. సంక్రాంతి పండుగ రోజున రవి, నవీన్‌లపై సుజాత, గోపాల్, సురేశ్ దాడి చేశారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఒకరికి మూడు రోజుల జైలు

బీబీపేట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు శిక్షను జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ప్రతాప్ విధించినట్లు ఎస్సై అనిల్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కాటం సంతోష్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం సేవించినట్లు తేలడంతో కేసు నమోదు చేశారు. ఈ మేరకు జడ్జి సంతోష్‌కు మూడు రోజుల జైలు, రూ. 300 జరిమానా విధించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపరాదని సూచించారు.

యువకుడి అదృశ్యం



పెద్దకొడప్‌గల్: మండలంలోని అంజని గ్రామానికి చెందిన బర్దావాల్ బహదూర్‌సింగ్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఏఎస్సై రాములు మంగళవారం తెలిపారు. అనారోగ్యానికి గురైన తల్లితండ్రులను బహదూర్‌సింగ్ శ్రద్ధగా చూసుకుంటున్నట్లు చెప్పారు. శనివారం ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన బైక్



గాయాలపాలైన మహేశ్

తాడ్వాయి: ఆటో, బైకు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండల కేంద్రానికి చెందిన మహేశ్, రితీశ్ బైక్‌పై లింగంపేట్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్నారు. సంతాయిపేట్‌కు చెందిన బాలురాజు తన ఆటోలో కామారెడ్డి నుంచి సంతాయిపేట్ వైపు వస్తుండగా వీరిని ఢీకొనడంతో బైక్‌పై ఉన్న మహేశ్, రితీశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జు అయింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

పెద్దకొడప్‌గల్: అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన మండలంలోని అంజని, జగన్నాథ్‌పల్లి శివారులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం నుంచి దెగ్లూర్ వైపు వెళ్తున్న ట్రాక్టర్ అంజని, జగన్నాథ్‌పల్లి శివారులో అదుపుతప్పి బోల్తాపడిందన్నారు. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.



కాపర్ కేటుగాళ్లు

- మూడు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రూ. 3 లక్షల కాపర్, ఆయిల్ చోరీ



నాగిరెడ్డిపేట: జిల్లాలో కాపర్‌కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. గ్రామ శివార్లలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లనే టార్గెట్ చేస్తూ కాపర్ వైర్లు, ఆయిల్ చోరీకి పాల్పడుతున్నారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని రాఘవపల్లి, ధర్మారెడ్డి గ్రామ శివార్లలో ఉన్న మూడు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి దుండగులు కాపర్ వైరు, ఆయిల్‌ను సోమవారం రాత్రి చోరీ చేశారు. వీటి విలువ సుమారు రూ. 3 లక్షల వరకు ఉంటుందని నాగిరెడ్డిపేట ట్రాన్స్‌కో ఏఈ మనోరంజన్ తెలిపారు. రెండు గ్రామాల్లోని రైతులు తమ పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్, ఆయిల్ చోరీకి గురైనట్లు సమాచారం అందించడంతో పరిశీలించినట్లు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.